సాక్షి
వికారాబాద్

మంగళవారం । 7 । మే । 2024



మధుర ఫలం.. మామిడి

మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. నోరూరించే ఫలాలు మార్కెట్‌లోకి రానే వచ్చాయి. 10లో▸



డొక్కు బస్సులు..

కాలం చెల్లిన బస్సులతో ఆర్టీసీ కాలయాపన చేస్తుండగా.. వాటిల్లో ప్రయాణిస్తున్న వారికి తిప్పలు తప్పడం లేదు. 10లో▸



'పందిరి' నిధుల పరేషాన్

కూరగాయల సాగులో పందిళ్లు వేసుకున్న రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకం అందక అవస్థలు పడుతున్నారు. 11లో▸

న్యూస్‌రీల్

టీమ్ వర్క్‌గా పనిచేయండి

ఎస్పీ కోటిరెడ్డి



అనంతగిరి: టీమ్ వర్క్‌గా పనిచేసి లోక్‌సభ ఎన్నికలను విజయవంతం చేయాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం డీఎస్పీలు, సీఐ, ఎస్‌ఐలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. విధులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల పూర్తి సమాచారం తెలుసుకొని ఉండాలన్నారు. సమస్యాత్మక స్టేషన్ పరిధిలో సీసీ టీవీల ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల రోజు పోలింగ్ సిబ్బంది విధులను అడ్డుకున్నా, పోలింగ్ జరగకుండా చూసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీలు రవీందర్‌రెడ్డి, మురళీధర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కేంద్రంలో వచ్చేది మా ప్రభుత్వమే

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



చాపలగూడెంలో ప్రచారం చేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చాపలగూడెంలో యువజన కాంగ్రెస్ నాయకుడు కుమ్మరి స్వామి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్ కుమార్, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ నాయకులు కుమ్మరి స్వామి, యువజన విభాగం మండల అధ్యక్షుడు జంగయ్య, నాయకులు జోగు వెంకటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రాజేందర్‌రెడ్డి



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో రాజేందర్‌రెడ్డి

ధారూరు: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగిన నాగారం గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌లో తనకు ప్రాధాన్యత లేకపోవడంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి

బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా

నవాబుపేట: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని మరో సారి నమ్మి మోసపోరాదని బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. సోమవారం నవాబుపేటలో ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 70ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కోడిగుడ్ల స్కాం చేసి ఆ డబ్బుతో ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గాలయ్య, రామేష్, శ్రీధర్, గోపాల్, శేఖర్‌రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

హరితం 9

- తొమ్మిదో విడత హరితహారానికి సిద్ధమవుతున్న అధికారులు
- ఈ ఏడాది నాటాల్సిన మొక్కలు 40,53,500
- 19 ప్రభుత్వ శాఖలకు బాధ్యతలు
- 80శాతం సంరక్షించేలా ప్లాన్



పరిగి మండలం బసిరెడ్డిపల్లి నర్సరీలో పెంచుతున్న మొక్కలు

వికారాబాద్: జిల్లాలో హరితహారం కార్యక్రమానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వానాకాలం సమీపిస్తుండటంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. పలు ప్రభుత్వ శాఖలను భాగస్వాములను చేసి శాఖల వారీగా వారికి లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. గతేడాదిలాగే ఈ సారి కూడా 19 ప్రభుత్వ శాఖలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా ప్లాన్ చేశారు. అటవీ, గ్రామీణాభివృద్ధి శాఖ ల పర్యవేక్షణలో హరితహారానికి రూపకల్పన చేస్తున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించిన వారు శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సారి జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. తొమ్మిదో విడత కార్యక్రమాన్ని వానాకాలం ఆరంభంలోనే మొదలు పెట్టేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశించడంతో అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు.

విరివిగా మొక్కలు పెంచేలా..

వాతావరణ కాలుష్య నియంత్రణ, పచ్చదనాన్ని అభివృద్ధి చేయడం, వర్షాభావ పరిస్థితుల నుంచి బయటపడేందుకు అడవుల పెంపకం ఒక్కటే మార్గమని భావించిన గత ప్రభుత్వాలు కొన్నేళ్లుగా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతూ వస్తున్నాయి. ఈ ఏడాది తొమ్మిదో విడత కార్యక్రమానికి అధికారులు సిద్ధమవుతున్నారు. రానున్న వానాకాలంలో జిల్లాలో 40,53,500 మొక్కలు నాటాలని నిర్ణయించారు. గత ఏడాది 40,54,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా దాదాపుగా టార్గెట్ పూర్తి చేశారు. గత సంవత్సరం నర్సరీల్లో, నాటిన మొక్కల్లో చాలా వరకు ఎండిపోయాయి. 80శాతం మొక్కలు బతికాయని అధికారులు చెబుతున్నా వాస్తవానికి మాత్రం కేవలం 50 నుంచి 60 శాతం మాత్రమే బతికినట్లు తెలుస్తోంది. ఈ సారి కూడా గత ఏడాదిలాగే 80 శాతం మొక్కలను విధిగా కాపాడాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఖాళీ స్థలాల్లో, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్‌సెంటర్లు, రోడ్డు పక్కన, బంజరు భూముల్లో, పొలం గట్ల వద్ద.. ఇలా అవకాశం ఉన్న ప్రతిచోటా మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పూర్తిస్థాయిలో సన్నద్ధం

హరితహారం కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నాం. జిల్లాలో అటవీ శాఖ, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలోని నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి తొమ్మిదో విడత హరితహారానికి సన్నద్ధం కావాలని ఆదేశించారు. కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. శాఖల వారీగా లక్ష్యాలు నిర్దేశించడం కూడా పూర్తయ్యింది.

– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మొక్కలు సిద్ధం

జిల్లాలోని 581 నర్సరీల్లో అటవీ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మొక్కలను పెంచుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 15, గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 566 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. వీటిలో 38,30,000 మొక్కలను పెంచుతున్నారు. టేకు మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. గచ్చకాయ, వెదురు, గుల్‌మోర్, రేన్‌ట్రీ, రావి, మర్రి, కానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్కలు, దానిమ్మ, నిమ్మ, గోరింటాకు, పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. వీటిని పాఠశాలల్లో పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు, ఇంటి వద్ద నాటుకునే వారికి అందజేస్తారు. జిల్లాలో అత్యధికంగా గ్రామీణాభివృద్ధి, గ్రామ పంచాయతీలకు 25 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్య నిర్దేశం చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 5లక్షలు, విద్యాశాఖ 11 వేలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ 9లక్షలు 43,500, ఉద్యానవన శాఖకు 2లక్షలు, వ్యవసాయ శాఖకు 5లక్షలు, తాండూరు మున్సిపాలిటీకి 70 వేలు, వికారాబాద్ మున్సిపాలిటీకి80 వేలు, కొడంగల్ మున్సిపాలిటీకి 35వేలు, పరిగి మున్సిపాలిటీకి 30వేలు ఇలా 19 ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించారు.

జవాబుదారీగా ఉండాలి

- ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు
- కలెక్టర్ నారాయణరెడ్డి
- ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్: ఎన్నికల విధుల్లో ప్రతి ఉద్యోగీ జవాబుదారీగా ఉండాలని, నిర్లక్ష్యం తగదని కలెక్టర్ సీ.నారాయణరెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను సోమవారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లలో బ్యాలెట్ పేపర్, అభ్యర్థులకు కేటాయించిన ఎన్నికల గుర్తులను అమరుస్తున్న తీరును పరిశీలించారు. 13న జరిగే పోలింగ్‌కు ఈవీఎంలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా కమిషనింగ్ పూర్తి చేయాలని సహాయ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్రమం తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం అదే కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పీఓ, ఏపీఓ, ఓపీఓలకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించాల్సిన విధులపై సూచనలు సలహాలు ఇచ్చారు. 13వ తేదీ ఉదయం 5.30 గంటలకు మాక్‌పోల్ నిర్వహణతో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. పోలింగ్ మొదలు పెట్టడం, 17 సీపీఓ డైరీ రాయడం, పోలింగ్ నిర్వహణపై సూచనలు ఇచ్చారు. అదే విధంగా 243,244 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్, తహసీల్దార్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, దానయ్య, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి పద్మావతి, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం: కలెక్టర్

అనంతగిరి: రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామన్నారు. సేకరించిన వడ్లను ఎప్పటికప్పుడు సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. ఇందుకు కోసం వాహనాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా చూడాలని, అవసరం మేరకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీఎస్‌ఓ రాజేశ్వర్, సివిల్ సప్లైయ్ డీఎం సుగుణబాయి, డీసీఓ ఈశ్వరయ్య, పాండురంగం, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



ఆటో కార్మికులతో కృష్ణయ్య

- బీఆర్‌టీయూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని బీఆర్‌టీయూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బీ కృష్ణయ్య ఆరోపించారు. సోమవారం వికారాబాద్‌లో ఆటో యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మిక కుటుంబాలను బజారు పాలు చేసిన కాంగ్రెస్ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, గిరాకీ లేక అవస్థలు పడుతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలన్నదే తమ డిమాండ్ అని పేర్కొన్నారు. పిలిస్తే పలికే నాయకుడు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసే బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్మికుల సంక్షేమం గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన తక్కువ రోజుల్లోనే అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. 13న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మైపాల్‌రెడ్డి, మాణిక్యం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేను పక్కా లోకల్



'ఇక్కడే చదువుకున్నా.. ఇక్కడే ఉద్యోగం చేశా. ఆఫీసు, ఇళ్లు అన్నీ ఇక్కడే. 40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా. నేను పక్కా లోకల్. అంగుళం భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా, ఒక్క మక్క గింజ అక్రమంగా తీసుకున్నట్లు రుజువుచేసినా.. నా ఆస్తులన్నీ వారికి రాసిచ్చేస్తా' అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేకే ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి మళ్లీ గెలిచేది తానేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'సాక్షితో' ప్రత్యేకంగా మాట్లాడారు.

– సాక్షి, రంగారెడ్డిజిల్లా

40 ఏళ్లుగా ఇక్కడే ఉన్నా

- భూ కబ్జా నిరూపిస్తే ఆస్తులు రాసిచ్చేస్తా
- ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేకే ఆరోపణలు
- చేవెళ్ల గడ్డపై ఎంపీగా గెలిచేది మళ్లీ నేనే
- నా పని తీరే.. నా విజయానికి కొలమానం
- 'సాక్షి'తో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

❖ **ప్రచారం ఎలా సాగుతోంది. ప్రజల్లో స్పందన ఎలా ఉంది?**

❖ సీఎం రేవంత్‌రెడ్డితో రోజుకో నియోజకవర్గంలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నాం. పార్టీ అభిమానుల నుంచే కాదు, సాధారణ జనం నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ ఎన్నికల్లో మళ్లీ గెలువబోయేదీ నేనే. నా ప్రచారం.. నాకు లభిస్తున్న మద్దతు చూసి తట్టుకోలేక ప్రత్యర్థి అభ్యర్థి నాకు డిపాజిట్ రాదంటున్నాడు. ఎవరికి డిపాజిట్ రాదో త్వరలో తెలుస్తుంది.

❖ **ప్రత్యర్థులు మిమ్మల్ని స్థానికేతరుడిగా ప్రచారం చేస్తున్నారు?**

❖ 1982 నుంచి రాజేంద్రనగర్‌లో చదువుకున్నా. శంషాబాద్‌లో ఉద్యోగం చేశా. ఇక్కడే ఆఫీసు, ఇల్లు ఉంది. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆఫీసు ఎక్కడ? ఆయన ఇల్లెక్కడ? ఆయన ఇక్కడ పుట్టడం మినహా ఈ ప్రాంతానికి చేసిందేమిటి? చేవెళ్లతో ఆయన కంటే నాకే ఎక్కువ అవినాభావ సంబంధం ఉంది.

❖ **బీజాపూర్ రోడ్డు విస్తరణపై ఏం చెబుతారు? క్రెడిట్ నాదంటే.. నాదే అంటున్నారు?**


❖ రోడ్డు విస్తరణ పనులు మంజూరు చేయించిందే నేను. ప్రతి దానికి నా వద్ద ఆధారం ఉంది. వారి దగ్గర ఏమైనా ఆధారాలుంటే చూపించమనండి. కొండా ఎంపీగా ఉన్నప్పుడు 60 మీటర్ల రోడ్డుకు దరఖాస్తు మాత్రమే చేశారు. భారీ ట్రాఫిక్ ఉంటుందని కేంద్రం దాన్ని రద్దు చేసింది. డీపీఆర్‌ను మార్చింది. 45 మీటర్ల రోడ్డును మంజూరు చేసింది. భూ సేకరణ దాదాపు పూర్తయింది. కొంత మంది రైతులు కోర్టును ఆశ్రయించడం, రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లు ఉండటం, వాటి తొలగింపుపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు గ్రీన్ ట్రిబ్యూనల్‌ను ఆశ్రయించడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది.

❖ **బీఆర్‌ఎస్ మీకు సముచిత స్థానం కల్పించినా.. పార్టీని ఎందుకు వీడాల్సి వచ్చింది?**

❖ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాకు రాజకీయంగా భవిష్యత్తు ఇచ్చిన మాట వాస్తవమే. నేను అంతకంటే ఎక్కువ పార్టీ కోసం పని చేశాను. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలు సర్వేలు చేయించాం. సర్వేల్లో పార్టీ వీక్‌గా ఉన్నట్లు తేలింది. నిజానికి పోటీ చేయకూడదని భావించాను. కేసీఆర్ సహా కేటీఆర్‌కు ఇదే అంశాన్ని వివరించాను. కార్యకర్తలు, అభిమానుల ఒత్తిడితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తికి తలొంచక తప్పలేదు.

❖ **భూకబ్జాలు, దాణా కేసు అంశాన్ని ప్రత్యర్థులు పదేపదే ప్రస్తావిస్తున్నారు. వారికి మీరిచ్చే సమాధానం?**

❖ ప్రతి ఊళ్లో మీటింగ్ పెడుతున్నా. నేను ఒక్క ఇంచు భూమి కబ్జా చేసినట్లు నిరూపించినా.. నా భూములన్నీ రాసిస్తా. ఒక్క మక్క గింజ అక్రమంగా తీసుకున్నట్లు నిరూపించినా.. వారికి నా మొత్తం ఆస్తులు రాసిస్తా. కోడిగుడ్డును కల్తీ చేస్తున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎవరైనా గుడ్డును కల్తీ చేస్తారా? ఎవరెన్ని ఆరోపణలు చేసినా అంతిమ విజయం నాదే.




❖ **ఐదేళ్లలో చేసిన అభివృద్ధి పనులేమిటి? మళ్లీ గెలిస్తే ఏం చేస్తారు?**

❖ ఇప్పటికే 111 జీఓ ఎత్తివేయించాను. మన్నెగూడ రోడ్డును మంజూరు చేయించాను. రూ.100 కోట్లతో వికారాబాద్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాం. ఆ మున్సిపాలిటీలికి రూ.50 కోట్లు, పరిగి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, శంషాబాద్‌కు రూ.60 కోట్లు, జల్‌పల్లికి రూ.30 కోట్లు మంజూరు చేయించాను. వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేయించాను. రాజేంద్రనగర్‌కు డిగ్రీ కాలేజీ తీసుకొచ్చాను. కొండాపూర్‌లో ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేయించాను. గెలిచిన తర్వాత అడ్రస్ లేకుండా పారిపోయే వ్యక్తిని కాదు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటా. పార్టీలకు అతీతంగా ఆపదలో ఎవరు..ఏ రాత్రి ఫోన్ చేసినా స్పందిస్తా. విద్యా, వైద్య పరంగా ఆర్థిక సాయం అందిస్తా. నా పని తీరే కొలమానం.

నేత్రపర్వం.. లంకా దహనం

పట్టణంలో వెలసిన భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో భాగంగా సోమవారం తెల్లవారుజామున లంకా దహన మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆదివారం రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ నిర్వహించారు. బస్వణ్ణకట్ట వద్ద వందలాది మంది భక్తుల సమక్షంలో లంకా దహనం వేడుక నిర్వహించారు. ఉత్సవాల్లో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్, వీరశైవ సమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

– తాండూరు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



బాణసంచా పేల్చుతున్న భక్తులు



లంకా దహనం



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తజనం

క్లుప్తంగా

పకడ్బందీ చర్యలు


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొంరాస్‌పేట: పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. సోమవారం మండల పరిధి రేగడిమైలారంలో 198, 199, 200, 201 నంబరు గల పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీదేవి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, రవినాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటమ్మ, స్వరూప, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కలప లారీ పట్టివేత


పట్టుబడిన లారీ

కుల్కచర్ల: అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న లారీని సీజ్ చేసిన సంఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చౌడాపూర్ గ్రామ శివారులో లారీలో కలప తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు.. అక్కడికి చేరుకున్నారు. వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. కలప లభ్యమయింది. దీంతో లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ ఎండీ నజీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


కేరెళ్లి కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు: సమస్యాత్మక కేరెళ్లి, ధారూరు పోలింగ్ కేంద్రాలను సోమవారం వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సర్కిల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌లు పరిశీలించారు. పోలింగ్ జరిగే సమయంలో బూత్‌లలో ఏమైనా గొడవలు జరిగే అవకాశం ఉందా అనే తదితర విషయాలను సీఐ, ఎస్ఐలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా.. ఉపేక్షించేది లేదని, కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

పసికందును పొదల్లో వదిలేసిన ఇద్దరికి జైలు

బంట్వారం: పసికందును ముళ్ల పొదల్లో విడిచి వెళ్లిన కేసుల్లో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 వేల జరిమానా విధిస్తూ వికారాబాద్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి తొర్మామిడికి చెందిన ఇద్దరు వ్యక్తులు 2017లో ఓ పసి కందును పొదల్లో వదిలేశారు. ఈ సంఘటనకు సంబంధించి అప్పటి ఎస్ఐ శేఖర్‌గౌడ్ కేసు దర్యాప్తు చేసి, వివరాలను కోర్టుకు సమర్పించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ శ్రుతిదూత నిందితులకు పైశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బాలికను చేరదీసిన ఆర్‌పీఎఫ్ పోలీసులు

అనంతగిరి: ఏడుస్తూ కనిపించిన బాలకను చేరదీసి, సఖీ సెంటర్‌కు తరలించిన సంఘటన సోమవారం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రైల్వే స్టేషన్‌లో విలపిస్తున్న బాలిక (15)ను చేరదీసినట్లు ఆర్‌పీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సదరు చిన్నారిని వివరాలు అడగగా.. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ప్రాంతానికి చెందిన అంబిక అని, గొడవల కారణంగా తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంటి నుంచి వచ్చానని తెలిపినట్లు సీఐ వెల్లడించారు. మైనర్‌ను చైల్డ్‌లైన్‌కు అప్పగించగా, వారు సఖీ సెంటర్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని సీఐ తెలిపారు.

మధుర ఫలం.. మామిడి

- మ్యాంగో.. కేరాఫ్ పూడూరు
- నోరూరించే పండ్లతో మన్నెగూడ కళకళ
- ఆకాశాన్నంటిన ఫలాల ధర



మన్నెగుడలో మామిడి పండ్ల విక్రయ దుకాణం

పూడూరు: మామిడిపండ్ల సీజన్ ప్రారంభమైంది. నోరూరించే ఫలాలు మార్కెట్‌లోకి రానే వచ్చాయి. అలాంటి ఫలాలకు పూడూరు మండల మన్నెగుడ చిరునామాగా నిలిచింది. రకరకాల పండ్లు ఇక్కడ లభ్యమవుతాయి. ముఖ్యంగా దశేరి, చిన్నరసాలు, పెద్దరసాలు, బేనిషా, మల్లికా, బంగినపల్లి, తోతపరి, లంగ్డా, సఫేదా లాంటి రకాల పండ్లను ఇక్కడ విక్రయిస్తుంటారు. ఈ ప్రాంతంలో కాచే మామిడికి.. వికారాబాద్ మహమూదా అని పేరు పెట్టారు. గతంలో అధిక మోతాదు ఉన్న కార్బైడ్ వేసి, కాయలను మక్కబెట్టే వారు. ప్రభుత్వం దానికి నిషేధించడంతో ఎలాంటి రసాయనాలు లేని కాయలను మక్కబెడుతూ సహజసిద్ధమైన పండ్లను అమ్ముతున్నారు. మామిడి పండ్లు అంటే ఇష్టపడని వారు ఉండరు. అలాంటి ఫలాల ధరలు నింగినంటడంతో.. సామాన్యులు వాటిని కొనుగోలు చేయలేని దుస్థితి. అందుకు కారణం.. మామిడి అధిక దిగుబడి ఇచ్చే తోటలు ప్రస్తుతం 60 శాతం మాత్రమే ఉన్నాయి. అందులో గాలివానలకు, చెట్లకు నీరందక అక్కడక్కడ తోటలు దెబ్బతినడమే. దీంతో వ్యాపారులు పండ్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ఫలోంకి రాజా ఆమ్..

మామిడి పండును ఫలోంకి రాజా అని పిలుస్తారు. పోషక విలువలు అధికంగా ఉండటంతో అన్ని ఫలాలకంటే మామిడికి ప్రథమ స్థానం ఉంది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ పండు అంటే ఆసక్తి చూపనివారు ఉండరు. వివిధ రకాల పండ్లతోటలు వేల ఎకరాల్లో మన్నెగుడ ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. హైదరాబాద్–బీజాపూర్ అంతరాష్ట్ర రహదారి పోడవునా స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యాపారులు మామిడి పండ్లను విక్రయిస్తున్నారు. ఇక్కడ పండించే ఫలాలను ఇక్కడి నుంచి దేశ నలుమూలల తోపాటు, విదేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు.

రకాన్ని బట్టి ధర..

మామిడి పండ్ల రకాలను బట్టి ధరను నిర్ణయిస్తారు. అవి ఇలా ఉన్నాయి. ఒక కిలో బేనిషాకు రూ.70, దశేరి–100, మల్లిక–80, గోవా–120, తోతపరి–50, బంగినపల్లి–90, హిమాయత్–160, వికారాబాద్ మహముదా–100, రసాలు–100, లంగ్డా–60, చెర్కు రసాలు–100, రసమలై–80లుగా ధర నిర్ణయించి విక్రయిస్తుంటారు.

> **ఆశించిన దిగుబడి కష్టమే..**
>
> ప్రస్తుతం అనుకున్నంత మేర దిగుబడి వచ్చే అవకాశం లేదు. 50 శాతం మాత్రమే కాతకు వచ్చింది. ఇందులో వడగాలులకు తోటలు దెబ్బతింటున్నాయి. లక్షలు వెచ్చించి, తోటలు ఖరీదు చేశాం. ఈ సంవత్సరం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం కార్బైడ్‌ను నిషేధించింది. సహజసిద్ధంగా తయారు చేసిన నాణ్యమైన ఫలాలను విక్రయిస్తున్నాం.
>
> – ఇసాక్, వ్యాపారి

పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు

- దివ్యాంగ ఓటర్లకు వలంటీర్ల నియామకం
- జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ


సమావేశంలో మాట్లాడుతున్న స్వీప్ నోడల్ అధికారి ఎంఏ సత్తార్. చిత్రంలో జ్యోతి

అనంతగిరి: బధిరులు, అంధులు ఓటు హక్కును వినియోగించుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ తెలిపారు. ఓటు వినియోగంపై కలెక్టరేట్‌లోని తన చాంబర్లో స్వీప్ నోడల్ అధికారి ఎంఏ సత్తార్‌తో కలిసి బధిరులు, అంధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడారు. ఈ నెల 13 తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుందని, దివ్యాంగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. స్వీప్ కార్యాచరణలో భాగంగా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లు, ర్యాంప్‌ల సౌకర్యాలను కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు. అంధులు.. బ్రెయిలి లిపి బ్యాలెట్ పేపర్‌తో ఓటు వేయాలని చెప్పారు. దివ్యాంగ ఓటర్లకు, ప్రభుత్వం ఉచిత రవాణా సౌకర్యంతో పాటు పోలింగ్ బూత్‌ల వద్ద వీరికి సహాయకులుగా వలంటీర్లను నియమించినట్లు వెల్లడించారు. సమావేశంలో వీహెచ్ పీఎస్ అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్, జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మెరుపురి వెంకటేశ్ పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత రానీయొద్దు


కొనుగోలు కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ తదితరులు

ధారూరు: గోనె సంచుల కొరత రాకుండా, తక్కువగా ఉన్నప్పుడే తమకు సమాచారం ఇవ్వాలని పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిని ఆదేశించారు. సోమవారం ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నాగారం, గురుదోట్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను గమనించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, తాలు లేకుండా వడ్లను కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.

మండుటెండలో 'ఆసరా' వెతలు

- ఆరేళ్లుగా తిరుగుతున్నా పింఛన్ రావడంలేదని వృద్ధుడి ఆవేదన


పింఛన్ కోసం భార్య సహాయంతో మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన వృద్ధుడు

మొయినాబాద్: అసలే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటలు దాటిందంటే రోడ్లపైకి రావడానికి జనం జంకుతున్నారు. కానీ ఓ వృద్ధుడు పింఛన్ కోసం అంటూ తన భార్య సహాయంతో సోమవారం మిట్ట మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఆరేళ్లుగా తిరుగుతున్నా పింఛన్ రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల విఠలయ్య వృద్ధాప్య పింఛన్ కోసం ఆరేళ్ల క్రితం దరఖాస్తు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఆయనకు పింఛన్ మంజూరు కాలేదు. ప్రతి రెండు మూడు నెలలకోసారి మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అధికారులను అడుగుతున్నారు. వచ్చిన ప్రతిసారి వెబ్‌సైట్ ఓపెన్ అయిన తరువాత మీకు పింఛన్ వస్తుందని అధికారులు చెప్పి పంపుతున్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఎవరూ లేరు. అంతా పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల శిక్షణకు వెళ్లారు. కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్‌ను వృద్ధుడు కలిసి తనకు పింఛన్ ఎప్పుడొస్తుందని అడిగారు. వెబ్‌సైట్ ఓపెన్ కాలేదని.. అది ఓపెన్ అయిన తరువాత పింఛన్ వస్తుందని కంప్యూటర్ ఆపరేటర్ చెప్పడంతో చేసేదేమిలేక అదే ఎండలో నిరాశతో వెనుదిరిగారు.

బతికున్న రైతును చంపేసి..

- భూమిని విరాసతు చేసిన ఘటనలో 9 మందిపై కేసు


పాసుపుస్తకంతో వెంకటయ్య

కొందుర్గు: బతికుండగానే మరణించినట్లు ధ్రువీకరించి ఓ రైతుకు సంబంధించిన భూమిని ఇతరులపై పట్టా మార్పిడి చేసిన కేసులో తొమ్మిది మందిపై జిల్లేడ్ చౌదరిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామ శివారులో గడ్డం వెంకటయ్యకు 30 గుంటల భూమి ఉంది. ఆయనకు కుమారులు మల్లేశ్, నర్సింలతో పాటు ఓ కుమార్తె ఉంది. రైతుతోపాటు ఆయన వారసులకు తెలియకుండా వెంకటయ్య మరణించినట్లు ఓ అఫిడవిట్ జత చేసి అదే గ్రామానికి చెందిన తిమ్మగళ్ల గాయత్రి, హన్మగళ్ల మమత పేర్లపై సదరు భూమిని విరాసతు చేసి ధరణి పోర్టల్ ద్వారా అధికారులు పట్టా మార్పిడి చేశారు.

గతంలో ఫిర్యాదు

దీనిపై వీరన్నపేట గ్రామానికి చెందిన బాధిత రైతు ఈ ఏడాది ఏప్రిల్ 20న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి తహసీల్దార్ విజయ్ కుమార్‌తోపాటు, పట్టా మార్పిడి చేయించుకున్న గాయత్రి, మమత, స్టాంప్ వెండర్ రఫిక్ ఉద్దీన్, ఇందుకు సహకరించిన జంగయ్య, యాదయ్య, నర్సింలు, సుదర్శన్ తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ఇప్పటికే పట్టా మార్పిడి చేయించుకున్న మమత, గాయత్రిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సక్రమ్ తెలిపారు. త్వరలోనే మిగతా వారిని పట్టుకుంటామని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

నిజాయతీ చాటుకున్న ఉపాధ్యాయుడు

- పోగొట్టుకున్న బ్యాగును బాధితుల ఇంటికి వెళ్లి ఇచ్చిన టీచర్


బ్యాగును అందజేస్తున్న ఉపాధ్యాయుడు జహీర్‌అజాద్

మంచాల: భద్రంగా దాచుకున్న వస్తువులను దొంగిలిస్తున్న ఈ రోజుల్లో పోగొట్టుకున్న బంగారు ఆభరణాలను ఇంటికి తీసుకెళ్లి మరీ తిరిగి ఇచ్చి అందరి చేత శభాష్ అనిపించుకున్నాడు ఓ ఉపాధ్యాయుడు. వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రానికి చెందిన గ్యార కృష్ణ–స్వాతి దంపతులు తమ బంధువు అనారోగ్యానికి గురై ఇబ్రహీంపట్నంలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వారిని పరామర్శించి తిరిగి ఆదివారం రాత్రి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో సీతారాంపేట్ గేట్ సమీపంలో రోడ్డుపై బ్యాగు పడిపోయింది. ఇది గమనించని దంపతులు ఇంటి చేరిన తరువాత బ్యాగు పోయిందని గుర్తించారు. అందులో మూడు తులాల బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఉన్నాయని తీవ్ర ఆందోళన గురవుతున్నారు. ఆరుట్ల గ్రామానికి చెందిన జహీర్ అజాద్, సుభాస్‌లు వృత్తి రీత్య ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇబ్రహీంపట్నం నుంచి ఆరుట్లకు బైకుపై వస్తుండగా వారికి బ్యాగు రోడ్డుపై దొరికింది. పరిశీలించగా అందులో బంగారు ఆభరణాలు, నగదుతో పాటు ఆధార్ కార్డు ఉంది. వెంటనే ఆధార్ కార్డు ఆధారంగా బాధితుల ఇంటిని వెతుక్కుంటూ అజాద్ వెళ్లాడు. అప్పటికే తీవ్ర దుఃఖంలో ఉన్న వారికి మీ బ్యాగు దొరికిందని ఇచ్చారు. ఒక్కసారిగా ఆ దంపతుల కళ్లలో ఆనందభాష్పాలు రాలాయి. వెతుక్కుంటూ బ్యాగును ఇచ్చి, నిజాయతీని చాటుకున్న ఉపాధ్యాయుడిని స్థానికులు అభినందించారు.

డొక్కు బస్సులు.. తప్పని తిప్పలు

- గుట్ట ఎక్కుతూ మొరాయించిన సర్వీసు
- మండుటెండలో కాలినడకన గమ్యం చేరిన ప్రయాణికులు


కాలినడకన గుట్ట ఎక్కుతున్న ప్రయాణికులు


అనంతగిరిగుట్ట ఎక్కుతూ ఆగిపోయిన బస్సు

ధారూరు: కాలం చెల్లిన బస్సులతో ఆర్టీసీ కాలయాపన చేస్తుండగా.. వాటిల్లో ప్రయాణిస్తున్న వారికి తిప్పలు తప్పడం లేదు. తాజాగా ఇదే జరిగింది. సామర్థ్యానికి మించిన ప్యాసింజర్స్‌తో ఓ బస్సు అనంతగిరి గుట్ట ఎక్కుతుండగా అది మధ్యలో ఆగిపోయింది. ఎంతకీ కదలక పోవడంతో పాపం ప్రయాణికులు మండుటెండలో కాలినడకన గుట్టపైకి ఎక్కాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం తాండూరు నుంచి ధారూరు మీదుగా హైదరాబాద్ వెళ్తున్న ఏపీ 29 జెడ్ 3609 ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అనంతగిరిగుట్ట ఎక్కుతూ.. రెండో ఘాట్ రోడ్డుపై ఆగిపోయింది. ఎంతకీ కదలకపోవడంతో.. డ్రైవర్ ప్రయాణికులను దింపేసి, బస్సును గుట్టపైకి ఎక్కించగా.. ప్యాసింజర్స్ మాత్రం.. కాలినడకన గమ్యం చేరుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు స్పృహతప్పి పడిపోయినట్లు సమాచారం. దీనికి కారణం అధికంగా పాసింజర్స్ ఉండటం, స్పెషల్ గేర్ వేసినా ప్రయోజనం లేక.. ప్రయాణికులను దించాల్సి రావడం గమనార్హం.

కాలం చెల్లిన సర్వీసులు

డొక్కు బస్సులు, అవి ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయే తెలియని దుస్థితి ఏర్పడిందని ప్రయాణికులు వాపోయారు. గుట్ట ఎక్కుతూ బస్సు ఆగిందంటే.. అది ప్రయాణికులకు ఎంత ప్రమాదకరం. ఇలా ఫిట్‌నెస్ లేని సర్వీసులను ఎందుకు తిప్పుతున్నారో అధికారులకే తెలియాలని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాండూరు డిపో బస్సులే ఎక్కువగా మొరాయిస్తున్నట్లు వెల్లడించారు. ఇదే విషయమై గతంలో పలువురు సంస్థ అధికారులను అడిగితే.. కొత్త బస్సులు లేకుంటే తామేమ్ చేయగలం అంటూ సమాధానం ఇచ్చినట్లు వెల్లడించారు. ఇలాంటి బస్సుల వలన తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇటీవలే జరిగిన ఓ ఘటనలో ఇద్దరు ప్రయాణికులు మృత్యువాత పడ్డారని భయాందోళన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలో ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇలా గుట్టు ఎక్కుతూ బస్సులు ఆగిపోవడం కొత్తేమీ కాదని, అయినా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం వలనే ఇలా జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, విజయవాడ, శ్రీశైలం ముఖ్యంగా అధిక మలుపులతో కూడి, గుట్టపైకి వెళ్లే రహదారుల్లో కొత్త సర్వీసులను తిప్పాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మూడు ఇళ్లలో చోరీ

ఆమనగల్లు: మండల పరిధి మేడిగడ్డతండాలో ఆదివారం అర్ధరాత్రి మూడు ఇళ్లలో దుండగులు చోరీ చేశారు. తండాకు చెందిన రమేశ్, మరో ఇద్దరు రాత్రి వేళలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్లలోకి చొరబడ్డారు. బీరువాలను పగులగొట్టారు. సుమారు రెండున్నర తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించారు. సోమవారం ఉదయం కిందికి వచ్చి చూడగా, ఇళ్ల తాళాలు పగుల గొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బాధితుడు రమేశ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్ తండాను సందర్శించి, చోరీకి బాధితెల ఇళ్లను పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలనీ రోడ్డు కబ్జాకు యత్నం

- అధికారులకు ఫిర్యాదు చేసిన కాలనీవాసులు


కాలనీకి వెళ్లే దారిని తవ్విన ఆక్రమణదారులు

అబ్దుల్లాపూర్‌మెట్: రోడ్డు ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్, హయత్‌నగర్ సీఐకి కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యావిజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధి 4వ వార్డులో బృందావన్ హోటల్‌కు ఆనుకుని జాతీయ రహదారి నుంచి పలు కాలనీలకు వెళ్లేందుకు ఆయా లే అవుట్లు చేసిన సమయంలో రోడ్డును వేశారు. ఇటీవల కొంత మంది ఆ రోడ్డును కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన స్థానిక ఆపిల్ ఎవెన్యూ కాలనీ అసోసియేషన్, వేంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అడ్డుకోవడంతో ఆక్రమణదారులు వెళ్లిపోయారు. తాజాగా జాతీయ రహదారి నుంచి కాలనీలకు రాకపోకలు లేకుండా రోడ్డుకు అడ్డంగా గుంతను తవ్వారు. దీంతో కాలనీ వాసులు అక్కడికి చేరుకుని అడ్డుకోవడంతో దాడికి యత్నించారు. రోడ్డు ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రెండు కాలనీలకు చెందిన ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు సురేశ్‌రెడ్డి, నారాయణరెడ్డి వెంకట్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి ఉన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే..

భర్తను హత్య చేయించిన భార్య

- వీడిన మక్తమాదారంలో కాలిన మృతదేహం మిస్టరీ
- ముగ్గురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి


తాండ్ర రవీంద్ర (ఫైల్)

శంషాబాద్: కడ్తాల్‌లోని మక్తమాదారంలో కాలిన మృతదేహం కేసు మిస్టరీ వీడింది. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భార్యనే తన ప్రియుడితో కలిసి భర్త హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. గత నెల 30 కడ్తాల్ సమీపంలోని మక్తమాదారం బటర్‌ఫ్లై వెంచర్‌లో పూర్తిగా కాలి ఉన్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో కడ్తాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అదే సమయంలో అదృశ్యం కేసు నమోదు కాగా దాని ఆధారంగా పోలీసులు మృతిచెందిన వ్యక్తి నాదర్‌గుల్ బాలాపూర్‌కు చెందిన తాండ్రా రవీంద్ర (45) సెంట్రింగ్ వర్కర్‌గా గుర్తించారు. రవీంద్ర భార్య గీత (31) బాలాపూర్‌లో నివాసముంటున్న డీసీఎం డ్రైవర్ కడారి యాదరగిరితో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని గీత తన ప్రియుడి యాదగిరి కలిసి హత్యకు పథకం వేశారు.

కిడ్నాప్ చేసి..

ఈ నెల 29 సాయంత్రం మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విశాల్ మార్ట్ వద్ద తన భర్త రవీంద్ర ఉన్న సమాచారాన్ని గీత తన ప్రియుడు యాదగిరికి చెప్పింది. దీంతో అతడు బలెనో కారులో తన స్నేహితుడు చిత్రం అనిల్‌కుమార్ (31) కలిసి అక్కడకి వచ్చి బలవంతంగా రవీంద్రను కారులో ఎక్కించుకుని వెళ్లారు. కారులోనే అతడిని విల్‌పానా ఇతర పరికరాలో విచక్షణ రహితంగా కొట్టారు. మక్తమాదారం బటర్‌ఫ్లై వెంచర్‌కు చేరుకున్న తర్వాత వాటిర్‌బాటిల్‌లో తెచ్చిన పెట్రోలు పోసి నిప్పంటించారు. మంటలకు తాళలేక అతడు సమీపంలోనే కుప్పకూలి చనిపోయాడు. అదే రోజు రాత్రి గీత తన భర్త రవీంద్ర అన్నయ్య రఘునందన్‌కు ఫోన్ చేసి చెప్పింది. మరుసటి రోజు సాయంత్రం వరకు ఫిర్యాదు చేయకపోవడంతో ఆమెను వెంట బెట్టుకుని రఘునందన్ మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసుతో పాటు ఇతర సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్న పోలీసులు వారి నుంచి కారుతో పాటు హత్యకు ఉపయోగించిన పనిముట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో అదనపు డీసీపీ రాంకుమార్, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, కడ్తాల్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ ఉన్నారు. కేసును చేధించిన కడ్తాల్, ఆమన్‌గల్, షాద్‌నగర్ పోలీసులను డీసీపీ అభినందించడంతో పాటు రివార్డును అందజేశారు.

బెల్టు షాపులపై దాడులు

షాద్‌నగర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వెలిజర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల, హాజిపల్లి, షాద్‌నగర్ పట్టణంలో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బెల్టుషాపులపై దాడులు చేపట్టారు. వెలిజర్ల గ్రామంలో రాఘవేందర్ నిర్వహిస్తున్న షాపులో 11.34 లీటర్ల (63 లిక్కరు బాటిళ్లు) మద్యాన్ని స్వాధీనం చేసుకొని షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.12 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం అమ్మినా, నిల్వ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గల్లంతైన మృతదేహాలు లభ్యం

పహాడీషరీఫ్: చేపలు పట్టేందుకు వెళ్లి జల్‌పల్లి చెరువులో గల్లంతైన ఇద్దరు బాలుర మృతదేహాలను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సోమవారం వెలికితీశాయి. పహాడీషరీఫ్ పోలీసుల వివరాల ప్రకారం.. పాతబస్తీ బార్కాస్‌కు చెందిన అబ్దుల్ వాహెద్(14), ఉస్మాన్ నహదీ(16), హఫీజ్, వసీం, అబుబకర్ నహదీ అనే బాలురు ఆదివారం చేపలు పట్టేందుకు వచ్చి వాహెద్, ఉస్మాన్ నహదీలు గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటినుంచి గాలించినప్పటికీ లభ్యం కాకపోవడంతో, సోమవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలించగా రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.